సాక్షి
వికారాబాద్

బుధవారం । 7 । జూన్ । 2023



బోగస్ ఓట్లకు చెక్

రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. 8లో▸



పవర్ కట్‌తో పరేషాన్

ధారూరులో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. రోజుకు 6 నుంచి 12గంటల పాటు సరఫరాను నిలిపివేస్తున్నారు. 8లో▸



నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్ హెచ్చరించారు. 9లో▸

పారిశ్రామిక రంగంలోనూ రాణించండి

- యువతకు జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పిలుపు
- ఘనంగా పారిశ్రామిక ప్రగతి దినోత్సవం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, చిత్రంలో కలెక్టర్ తదితరులు

వికారాబాద్ అర్బన్: పరిశ్రమలను స్థాపించి ఆర్థికంగా ఎదిగేందుకు యువత ముందుకు రావాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పారిశ్రామిక ప్రగతి కార్యక్రమాన్ని జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ యువత పారిశ్రామిక రంగాల్లో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు కూడా ఆ దిశగా కృషి చేయాలన్నారు. సమయాన్ని వృధా చేసుకోకుండా చిన్న చిన్న వ్యాపారాలైనా చేస్తూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. బ్యాంకులు ఇస్తున్న రుణాలతో చాలా మంది ఇళ్లు నిర్మించుకుంటున్నారని, అలా కాకుండా వ్యాపారాలు చేస్తే ఆర్థికంగా బలపడే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ స్వయం కృషి పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధ్యమన్నారు. ఇష్టంగా పనిచేస్తే మంచి ఫలితం వస్తుందన్నారు. జిల్లాలో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఆసక్తిగల వారికి సబ్సిడీ రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. టీఎస్ ఐపాస్ కింద అన్ని రకాల అనుమతులతో పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. యువత పరిశ్రమలు స్థాపించి ఆర్థికంగా ఎదగడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ వినయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బడికి వస్తేనే బతుకు కన్నా..

‘చిన్నా.. బడికి రావాలిరా.. ఏడవకురా..’ అంటూ ఓ బాలుడిని ఉపాధ్యాయులు బతిమిలాడటం కనిపించింది. మంగళవారం రేగడిమైలారంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ బాలుడి పేరు నమోదు చేసుకుంటుండగా తల్లిదండ్రులను విడిచిరానంటూ మారాం చేశాడు. మొత్తానికి ఉపాధ్యాయులు ఒప్పించి బడిబాట పట్టించారు. – బొంరాస్‌పేట



బాలుడికి నచ్చజెబుతున్న టీచర్లు

రూ.92 కోట్లతో రైల్వే బ్రిడ్జి నిర్మాణం

- సీఎం కేసీఆర్ హామీ
- ఎమ్మెల్యే ఆనంద్ వెల్లడి



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో రూ.92 కోట్లతో రైల్వే బ్రిడ్జి నిర్మిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తెలిపారు. ఎమ్మెల్యే మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్‌లో నూతన రైల్వే బ్రిడ్జి నిర్మాణం గురించి ప్రస్తావించగా సీఎం వెంటనే సంబంధిత శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణం ఫైల్ పంపాలని ఆదేశించారన్నారు. రూ. 92 కోట్లతో నూతన రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. అలాగే సీఎం చీఫ్ సెక్రటరీ పలు అభివృద్ధి అంశాలపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గ్రూప్-1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ నెల 11న జరిగే గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని వికారాబాద్ పట్టణంలో 15 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 8:30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఆ తరువాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోరని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రం కోడ్ నంబర్ 4,32,013 టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌జేసీ శివారెడ్డిపేట్ అనే సెంటర్ శివారెడ్డిపేట్ లో కాకుండా అనంతగిరిపల్లి బుగ్గ సమీపంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఉంటుందనే విషయాన్ని అభ్యర్థులు గమనించాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ డెస్క్ నం. 79950 61192ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రేపు ఊరూరా చెరువుల పండుగ

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న ఊరూరా చెరువుల పండుగ నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 7న సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిపై కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 8న అన్ని గ్రామ పంచాయతీలలోని చెరువుల వద్ద పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేయాలని చెప్పారు. చెరువుల వద్దనే ప్రజలకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగలు తగిలి..

- ఐదు ఆవులు, బర్రె మృతి
- రూ. 3లక్షలకు పైగా నష్టం



పెద్దేముల్: తెగి పడిన విద్యుత్ తీగలు తగిలి ఐదు ఆవులు, ఓ బర్రె మృతి చెందిన సంఘటన మంగళవారం పెద్దేముల్ మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చైతన్యనగర్ గ్రామానికి చెందిన లాలు, సర్పంచ్ లలిత, ఎల్లమ్మకు చెందిన పశువులను ఎప్పటిలాగే పొలాల వద్ద మేతకు వదిలి ఇంటికి వచ్చారు. రాత్రి అవి ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లి చూడగా ఆవులు, బర్రె తెగిపడిన విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందినట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ. 3లక్షలకు పైగా ఉందని రైతు లాలు తెలిపారు. ఈదురు గాలులకు కరెంటు వైర్లు తెగి పడినట్లు తెలిసింది. పెద్దేముల్ పశువైద్యాధికారి డాక్టర్ వెంకటపతిరాజు గ్రామానికి వెళ్లి మృతి చెందిన పశువులను పరిశీలించారు. విద్యుత్ అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఇసుక ట్రాక్టర్లతో ఎస్ఐ సంతోష్‌కుమార్

ధారూరు: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండలంలోని అంపల్లి, నాగారం గ్రామాల శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. డ్రైవర్లు హనుమంతు, బి. అనంతయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వందశాతం సబ్సిడీతో రుణం ఇవ్వాలి

నాయీబ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణులు

అనంతగిరి: బ్యాంకులతో సంబంధం లేకుండా నాయీబ్రాహ్మణులకు వంద శాతం సబ్సిడీతో లక్ష రూపాయలు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దళిత బంధు తరహాలో నాయీబ్రాహ్మణులకు లక్ష రూపాయల సాయం చేస్తే తామంతా ఆర్థికంగా మరింత బలోపేతం అవుతామని పేర్కొన్నారు.

75 కిలోల నకిలీ విత్తనాల పట్టివేత

బషీరాబాద్: నకిలీ విత్తనాలతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని బషీరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలోని ముధోల్ గ్రామానికి చెందిన వెంకటప్పగా గుర్తించిన పోలీసులు విచారణ చేపట్టారు. కర్ణాటకలో తక్కువ ధరకు తీసుకువచ్చి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. అతడి వద్ద 75 కిలోల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నామని.. వాటి విలువ రూ.1,35,000 ఉంటుందని పోలీసులు చెప్పారు. బషీరాబాద్ ఏఓ సూర్యప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.

బోగస్ ఓట్లకు చెక్



గ్రామాల్లో ఓటరు జాబితా సవరణ

- ఇంటింటికి వెళ్లి పరిశీలన
- డబుల్ ఓట్లు ఉంటే ఒకటి తొలగింపు, ఆధార్ అనుసంధానం

పరిగి: రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటరు జాబితా సవరణకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఇంటింటికి వెళ్లి ఓటరు పరిశీలన కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైంది. జిల్లాలో ఇప్పటికే ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు, సవరలు ప్రారంభం కాగా జూన్ 23వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేస్తారు. జూన్ 24 నుంచి జులై 24వ తేదీ వరకు పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, జూలై 25 నుంచి ఆగష్టు 31వ తేదీ వరకు సవరణలు పరిశీలన, ముసాయిదా జాబితా ప్రచురణ, సెప్టెంబర్ 2నుంచి 31వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, అక్టోబర్ 4న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

ఇంటింటికీ అధికారులు

ఓటరు జాబితా సవరణ ఈ సారి పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో సవరణ కార్యక్రమం ఇంటింటికి వెళ్లి చేస్తున్నారు. పరిగి నియోజకవర్గంలో 305 బూత్‌లు, 2.35,414 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 1,20,032 మంది, స్త్రీ ఓటర్లు 1,15,374మంది, అదర్స్ 8 మంది ఉన్నారు. డబుల్ ఓట్లను తొలగించేందుకు ఓటర్ల జాబితాలను ఆధార్ కార్డులతో అనుసంధానం చేస్తున్నారు. అధికారులు ఇంటింటికి వెళ్లి ఇప్పటికే ఆధార్ కార్డులు సేకరించడమే కాకుండా రెండు ఓట్లు ఉంటే ఏ ఓటు ఉంచాలనే విషయమై వారి నుంచి దరఖాస్తు తీసుకుని ఒక ఓటును తొలగిస్తున్నారు. ఓటర్లు జాబితాలో మార్పులు, చేర్పులు సవరణలపై దరఖాస్తులు తీసుకోవడమే కాకుండా పలుమార్లు చేర్పులు, సవరణలపై దరఖాస్తులు తీసుకోవటమే కాకుండా పలు మార్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆరు ఓట్ల కంటే ఎక్కువ ఉన్న నివాలసాలతో పాటు 10 మంది కంటే ఎక్కువగా 15 మంది, 20 మంది, 50 మంది, 100 మంది ఈ విధంగా ఎక్కువగా ఓట్లున్న ఇంటి నంబర్లను గుర్తించి ప్రత్యేకంగా విచారణ జరుపుతున్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

నియోజకర్గాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో అధికారులు సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి వారంలో రాజకీయ పార్టీలతో అధికారులు ఓటరు జాబితాను ఇచ్చి అందులో సవరణలు, మార్పులు, చేర్పుల విషయంపై చర్చిస్తున్నారు. పార్టీ నాయకులు గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కులపై అవగాహన కల్పించి, ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



ఓటర్ల జాబితా సవరణకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల సవరణలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకుని పరిష్కరిస్తున్నాం. రాజకీయ పార్టీల ప్రతినిధులతో పలు మార్పు సమావేశాలు ఏర్పాటు చేశాం. ప్రధానంగా బోగస్ ఓట్ల తొలగించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టాం.

– రాంబాబు, తహసీల్దార్ పరిగి

ఓటు అమ్ముకొని వనవాసం వెళ్లొద్దు



కొండాపూర్‌లో మాట్లాడుతున్న రమేష్ మహరాజ్

- రైతులకు ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ సూచన
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 2లక్షల రైతు రుణమాఫీ

పెద్దేముల్: రాబోయే ఎన్నికల్లో ఓటును అమ్ముకొని వనవాసం వెళ్లొద్దని, ఓటుతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ రైతులకు సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లవుతున్నా రైతులకు చేసింది ఏమీ లేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి రైతుకూ రూ. 2లక్షల రుణమాఫీ అమలు చేస్తామని ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ హామీ ఇచ్చారు. హత్ సే హత్ జోడో కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దేముల్ మండలం మంబాపూర్, రుక్మాపూర్, కొండాపూర్, రెగోండి, మదనంతపూర్ మరి కొన్ని గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రమేష్ మహరాజ్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో నేను చేసిన తప్పుకు క్షమాపణ చెబుతున్నానని, ఇక ముందు అలాంటి తప్పు జరగనివ్వనన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ని బొంద పెట్టడం ఖాయమన్నారు. అన్ని వర్గాలకు కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ, భూమి లేని రైతులకు నెలకు రూ.1000, రైతు బీమాతో పాటు పంటకు మద్దతు ధర అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం ఎమ్మెల్యేల బతుకులు మాత్రమే బాగు పడ్డాయన్నారు. గతంలో మహేందర్‌రెడ్డిని ఎలా ఓడించారో, అదే విధంగా రోహిత్‌రెడ్డిని కూడా ఓడించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శోభరాణి, హన్మాపూర్ మాజీ సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజు, నాయకులు ఉదయశంకర్, హబీబ్ లాల, నర్సిరెడ్డి, నర్సింలుగౌడ్, మైపూస్, కిరణ్, బుగ్గప్ప, రాములు పాల్గొన్నారు.

ఫిష్ ఫెస్టివల్‌ను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: మత్స్య సంపదను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8, 9, 10 తేదీల్లో వికారాబాద్‌లో ఫిష్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మంగళవారం మత్స్య శాఖ అధికారులతో కలిసి ఫిష్ ఫెస్టివల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మత్స్య శాఖ జిల్లా అధికారి చరిత మాట్లాడుతూ.. వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో ఫిష్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుచికరమైన వంటకాలు తయారు చేస్తారని తెలిపారు. ఈ మేళాలలో ప్రజలంతా భాగస్వాములవ్వాలని కోరారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

కోటి ఆశల వానాకాలం సాగు

కోటి ఆశల ఖరీఫ్ ప్రారంభం కానుండడంతో రైతులు పొలం బాట పడుతున్నారు. మరి కొద్ది రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉండడంతో అన్నదాతలు పొలాలను సాగుకు సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులతోపాటు వ్యవసాయ పనిముట్ల తయారు చేసే వడ్రంగులు, కమ్మరిలు బిజీగా మారారు. ఖరీఫ్ కలసి వచ్చి అన్నదాతలకు కాసులు కురిపించాలని ఆకాంక్షిద్దాం..

– బొంరాస్‌పేట



వ్యవసాయ పనిముట్లను సిద్ధం చేస్తున్న వడ్రంగులు

ప్రజలంతా కాంగ్రెస్ వైపే



కిష్టయ్యకు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్‌కుమార్

- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రజలంతా కాంగ్రెస్ వైపే చూస్తున్నారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కేసారం గ్రామ ఉప సర్పంచ్ బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని ప్రసాద్‌కుమార్ నివాసంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందన్నారు. నాలుగు సంవత్సరాలు దాటినా రైతు రుణమాఫీ ఊసే లేదన్నారు. హామీలు ఇవ్వడం మరిచిపోవడం బీఆర్ఎస్‌కు పరిపాటిగా మారిందని ఆరోపించారు. అకాల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని చెప్పి నేటికి మూడు నెలలు గడుస్తున్నా సాయం అందలేదన్నారు. సీఎం అడుగడుగునా రైతులను మోసం చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు, రైతులు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, అనందం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం



మరికల్ గ్రామ కొనుగోలు కేంద్రంలో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

- డీసీసీబీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: రైతులకు ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం సేకరించడం జరుగుతుందని డీసీసీబీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని కోరారు. దీంతో మనోహర్‌రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. కుల్కచర్ల మండలం తిర్మలాపూర్‌లోని గోదాంను తాత్కాలికంగా అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరికల్, కల్మన్‌కాల్వ, చౌడాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో సుమారు 2,500 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్‌తో పరేషాన్

ప్రతిరోజూ జాగారమే

- దోమల స్వైరవిహారం
- జ్వరాల బారిన జనం
- పంటలు, వ్యాపారులపై ప్రభావం



ధారూరు విద్యుత్ సబ్‌స్టేషన్

ధారూరు: పట్టణంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. రోజుకు 6నుంచి 12గంటల పాటు విద్యుత్‌ను కట్ చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. ఓ వైపు మండుతున్న ఎండలు.. మరో వైపు విద్యుత్ కోతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 15 రోజులుగా సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గంటల తరబడి సరఫరా లేకపోవడంతో విద్యుత్ ఆధారంగా నడిచే పండ్ల జ్యూస్ దుకాణాలు, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక రాత్రి వేళ కోతల కారణంగా ప్రజలు జాగారం చేయాల్సి వస్తోంది. ఓ వైపు కోతలు.. మరో వైపు ఉక్కపోత.. ఇంకో వైపు దోమల దాడితో జనం బెంబేలెత్తి పోతున్నారు. దోమల స్వైరవిహారంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండలంలోని మోమిన్‌కలాన్, నాగసమందర్, నాగారం, మున్నూరు సోమారం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో సరఫరా సక్రమంగా ఉండడం లేదు. ధారూరు సబ్‌స్టేషన్‌కు కొన్ని రోజుల పాటు వికారాబాద్ నుంచి, మరికొన్ని రోజులు తాండూర్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. తాండూర్ మార్గంలో అడవి ఉండడం వల్ల గాలి తీవ్రతకు చెట్ల కొమ్మలు తగిలి సరఫరా నిలిచి పోతోంది. అధిక లోడు కారణంగా నాణ్యమైన సరఫరా కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ధారూరు ప్రజలు కోరుతున్నారు.

కోతలు అధికం



మండల కేంద్రంలో ఎప్పుడు కరెంటు ఉంటుందో ఎప్పుడు ఉండదో తెలియడం లేదు. రాత్రి కోతల కారణంగా జాగారం చేయాల్సి వస్తోంది. రైతులు, వ్యాపారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి.

– దయాకర్‌రెడ్డి, రైతు, కేరెళ్లి

రోడ్డుపైనే మురుగు

బొంరాస్‌పేట: మండల కేంద్రం నడిబొడ్డున భూలక్ష్మి చౌరస్తాలో మురికి నీటి గుంట స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన కూడలిలో ఏర్పడిన మురికి నీటి గుంటను పూడ్చడానికి చర్యలు తీసుకోవడం లేదు. రోడ్డుపై నీరు నిలవడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు కూడా పాడవుతోంది. నిత్యం ఈ మార్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బొంరాస్‌పేట ప్రధాన రహదారిలో ఏర్పడిన మురికి నీటి గుంత

సర్కారు స్కూళ్లలో నాణ్యమైన విద్య



సయ్యాద్‌పల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న పాఠశాల సిబ్బంది

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సయ్యాద్‌పల్లి, చిట్యాల తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పిల్లలకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు ఇస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బడీడు పిల్లలను పనులకు పంపడం సరికాదన్నారు. చిన్నారులను పాఠ శాలలకు పంపడం తల్లిదండ్రుల బాధ్య తని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి పాఠశాలల పనితీరుపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జైపాల్, వెంకటేశ్ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.